## తొరూరు మున్సిపాలిటీ 16 వార్డులకు కాంగ్రెస్ అభ్యర్థులకు బీ ఫారాలు

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝూన్సి రాజేందర్ రెడ్డి



**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 2**

తొరూరు మున్సిపాలిటీలోని 16 వార్డులకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు అధికారికంగా అందజేశారు..ఈ కార్యక్రమం సందర్భంగా నాయకులు అభ్యర్థులకు పార్టీ బీఫారాలను అందజేసి, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గడపగడపకు తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ..తొరూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన దృష్టికోణంతో ముందుకు సాగుతోందని, ప్రజల ఆశీర్వాదాలతో ఈ ఎన్నికల్లో అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజల మద్దతు పొందాలని ఆకాంక్షించారు..టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝూన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే నిబద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. అభ్యర్థులందరికి విజయవంతమైన ప్రచారం నిర్వహించి గెలుపొందాలని శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పారు. తొరూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ఈ ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు..

# పులి జాడ తెలిసిందా ?

### గంగారం అడవుల్లో పులి సంచారం కలకలంరెండు రోజులుగా భయాందోళనలో ప్రజలు

### అటవీశాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం

**తొలిసమయం కొత్తగూడ**

గంగారం మండలం మహాదేవునిగూడెం మరియు లింగాల మధ్య ఉన్న దట్టమైన అడవుల్లో పెద్ద పులి సంచరిస్తున్నట్టు సమాచారం వెలుగులోకి రావడంతో మండలవ్యాప్తంగా తీవ్ర భయాందోళన నెలకొంది. గత రెండు రోజులుగా ఈ వార్త ప్రజలకు కంటికి నిద్ర లేకుండా చేస్తోంది.

**సాయంత్రం అయ్యిందంటే ఇళ్లకే పరిమితం**

మహాదేవునిగూడెం, కోమట్లగూడ, పునుగొండ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సాయంత్రం తరువాత ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసం చేయలేకపోతున్నారు. పులి భయంతో పశువులను అడవుల్లోకి పంపడం మానేసి, వ్యవసాయ పనులు కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.పిల్లలున్నాయన్న అనుమానం భయం మరింత పెరిగిందిస్థానికుల కథనం ప్రకారం, మహాదేవుని గూడెంలింగాల



మధ్య అడవిలో పెద్ద పులి పిల్లలను పెట్టిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ప్రాంతంలో పులి పిల్లల శబ్దాలు వినిపిస్తున్నాయన్న ప్రచారంగ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. పిల్లలు ఉన్న సమయంలో పులి మరింత క్రూరంగా ప్రవర్తించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**అటవీశాఖ మౌనం ప్రజల్లో ఆగ్రహం**

ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. పులి జాడను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయకపోవడం, ప్రజలకు హెచ్చరికలు జారీ చేయకపోవడం వల్ల అటవీశాఖ తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.డప్పు చాటింపు గానీ, అధికారిక ప్రకటన గానీ లేకపోవడంతో అధికారులు నిమ్మకు నేరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**బయ్యారం అడవుల్లో పులి సంచారం ప్రచారం**

ఇదిలా ఉండగా, నిన్న బయ్యారం అడవుల్లో కూడా పులి సంచరిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అది ఇదే పులి అక్కడికి వెళ్లిందా? లేక వేరే పులి సంచరిస్తుందా? అన్నది స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో భయం మరింత పెరిగింది.తక్షణ చర్యలు తీసుకోవాలిపరిస్థితి చేయి దాటేలోపు అటవీశాఖ అధికారులు తక్షణమే పులి సమాచారం సేకరించి, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారి తీయొచ్చని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు హెచ్చరిస్తున్నారు

# ఖాకీకి గర్వకారణమైన సేవలు పదవి విరమణ పొందిన 5మంది

### పోలీసు అధికారులకు ఘన సన్మానం

**తొలి సమయం, వనపర్తి ఫిబ్రవరి 02**

పోలీసుశాఖ ప్రతిష్టను పెంచిన సేవలకు అభినందనలు, విశ్రాంత జీవితం ఆరోగ్యంగా, కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తూ పదవి విరమణ ఒక ముగింపు కాదు, కొత్త జీవనానికి ఆరంభ సేవలకు సలాం విశ్రాంతికి శుభాకాంక్షలు ఖాకీ యూనిఫాం ధరించి ప్రజల రక్షణకే జీవితాన్ని అంకితం చేసిన పోలీసు అధికారులు పదవీ విరమణ పొందినా, వారి సేవల విలువ మాత్రం ఎప్పటికీ తరుగదని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., వనపర్తి జిల్లాలోని వివిధ పోలీస్టేషన్లలో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజా శాంతి భద్రతల పరిరక్షణకు విశిష్ట సేవలు అందించి ఈ రోజు పదవి విరమణ పొందుతున్న 5 మంది పోలీసు అధికారులు వనపర్తి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ ఎస్సైలు బాలయ్య, దేవేంద్రయ్య, పెబ్బేరు ఏఎస్సై శ్రీనివాసులు, వనపర్తి రూరల్ ఏఎస్సై దౌలత్ ఖాన్, ఆత్మకూరు హెడ్ కానిస్టేబుల్ మన్నెపు రెడ్డి ఆరుగురు పోలీసు అధికారుల దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు, వారి నిబద్ధతతో కూడిన సేవలకు జిల్లా పోలీసుశాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ... త్యాగం, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ పోలీసుశాఖ ప్రతిష్టను పెంచిన ప్రతి అధికారి



సమాజానికి ఆదర్శమని పదవీ విరమణ సమయంలో ప్రతి ఉద్యోగికి సంతోషం, బాధ రెండూ సహజమని. పదవీ విరమణ ఒక ముగింపు కాదని, కొత్త జీవనానికి ఇది ఆరంభమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ నచ్చిన రంగంలో ఏదో ఒక వ్యాపకాన్ని అలవాటు చేసుకొని చురుకైన జీవన విధానాన్ని కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఖాళీగా ఉండటం వల్ల నిరుత్సాహం కలగవచ్చని, అందుకు బదులుగా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని అన్నారు.పదవీ విరమణ అనంతరం పొందే ఆర్థిక లాభాలను ప్రయోగాలకు లోనుచేయకుండా ప్రణాళికాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు ఉద్యోగం అనేక త్యాగాలతో కూడుకున్నదని, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల రక్షణ, న్యాయ పరిరక్షణ కోసం సేవలందించడం



గర్వకారణమని తెలిపారు. కష్టపడి, నిబద్ధతతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన జీపీఫ్, ఇన్స్యూరెన్స్ తదితర బెనిఫిట్స్ బిల్లులను అందజేసి, మిగిలిన ప్రయోజనాలు కూడా త్వరితగతిన అందేలా చూడాలని సంబంధిత సెక్షన్ అధికారులను ఆదేశించారు.ఈ పదవీ విరమణ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరా రెడ్డి, డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ, జిల్లా పోలీసుకార్యాలయం ఏ ఓ, సునందన, కొత్తకోట సీఐ, రాంబాబు,వనపర్తి సీఐ, రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, అప్పలనాయుడు, పదవీవిరమణ పొందిన పోలీసుఅధికారుల కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పాప విముక్తికి పవిత్ర రాత్రి షబ్ ఏ బరాత్

### రజబ్, షాబాన్‌లకు వారధిగా రంజాన్‌కు మార్గసూచిక

**తొలిసమయం కొత్తగూడ**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని మజీద్ ఏ అరఫాత్‌లో పవిత్ర షబ్ ఏ బరాత్‌ను భక్తిశ్రద్ధలతో ఈరోజు (మంగళవారం)నిర్వహించేందుకు మజీద్ ఏ అర్ఫాత్ అధ్యక్షులు మహ్మద్ అజ్మీర్ ఆధ్వర్యంలోఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పవిత్ర రాత్రి విశిష్టతలను భక్తులకు ఇమామ్ ముదస్సిర్ వివరించారు.షబ్ ఏ బరాత్‌లో 'షబ్' అంటే రాత్రి, 'బరాత్' అంటే పాపాల నుండి విముక్తి అని ఆయన తెలిపారు. ఈ రాత్రి అల్లాహ్ తన భక్తులకు అపార కరుణ ప్రసాదించి, నిజమైన పశ్చాత్తాపంతో ఇస్తాగ్ఫార్ (క్షమాపణ ప్రార్థన) చేసే వారికి పాప విమోచనం కలుగుతుందని ఇస్లామీయ విశ్వాసం.ఈ పవిత్ర రాత్రి జాగారం చేస్తూ, నమాజులు, నవాఫిల్, ఖురాన్ పఠనం, జిక్ర్, దుఆలతో ఆరాధనకు వేదికగా మారుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా శబ్దకాలుష్యం లేకుండా క్రమశిక్షణతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. షాబెబరాత్ సందర్భంగా ఖబ్రస్తాన్ దర్శించి మరణ సత్యాన్ని గుర్తుచేసుకోవడం, జీవితాన్ని సత్యమార్గంలో నడిపించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే ద్వేష భావాలను విడిచిపెట్టి శత్రువులను కూడా క్షమించడమే ఈ రాత్రి యొక్క అసలైన సందేశమని పేర్కొన్నారు.రజబ్, షాబాన్ అనే పవిత్ర మాసాల అనంతరం రాబోయే రంజాన్‌కు ఆత్మశుద్ధితో సిద్ధం చేసుకునే అవకాశమే షబ్ ఏ బరాత్ అని మసీదు కమిటీ వివరించింది. ఈ పవిత్ర రాత్రి ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందాలని ఇమామ్ ముదస్సిర్ ఆకాంక్షించారు.

**జాగరాలు ఎలా ....**

షబ్ ఏ బరాత్ పవిత్ర రాత్రి జాగరాలు కేవలం మేలుకుని ఉండడమే కాకుండా, ఆత్మశుద్ధి మరియు ఆరాధనతో గడపాల్సిన ముఖ్యమైన సమయంగా భావించాలి. ఈ రాత్రి జాగరాలను భక్తులు క్రమశిక్షణతో, ఇస్లామీయ ఆచారాలకు అనుగుణంగా నిర్వహించాలి.మొదటిగా మఘ్రిబ్ మరియు ఇషా నమాజులను సమయానికి పూర్తి చేసి, అనంతరం నఫిల్




నమాజులు, నవాఫిల్ చదవాలి. ఖురాన్ పఠనం, జిక్ర్, దుఆల ద్వారా అల్లాహ్‌ను స్మరిస్తూ రాత్రిని గడపాలి. ముఖ్యంగా ఇస్తాగ్ఫార్ చేస్తూ గత పాపాలకు క్షమాపణలు కోరడం ఎంతో ముఖ్యమని మత పెద్దలు సూచిస్తున్నారు.జాగరాల సమయంలో అనవసర మాటలు, నవ్వులు, గందరగోళం లేకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలి. మొబైల్ ఫోన్లు, శబ్దకాలుష్యం నివారిస్తూ సంపూర్ణ ధ్యాస ఆరాధనపై ఉండేలా చూసుకోవాలి. వీలైతే ఖబ్రస్తాన్‌ను దర్శించి మరణ సత్యాన్ని గుర్తుచేసుకొని, జీవితాన్ని సత్పథంలో నడిపించుకోవాలని సూచిస్తున్నారు.ఈ పవిత్ర రాత్రిలో ద్వేష భావాలను విడిచిపెట్టి, శత్రువులను కూడా క్షమిస్తూ హృదయాన్ని శుద్ధి చేసుకోవాలి. రంజాన్ మాసానికి ఆత్మికంగా సిద్ధమయ్యే మార్గంగా ఈ జాగరాలు మారాలని మత పెద్దలు ఆకాంక్షిస్తున్నారు.

**ఇస్తిగ్ఫార్ ....**

ఇస్తిగ్ఫార్ అనగా అల్లాహ్‌ను క్షమాపణ కోరడం. మన చేత తెలిసి గానీ, తెలియక గానీ జరిగిన పాపాలకు పశ్చాత్తాపంతో "అల్లాహ్ నన్ను క్షమించు" అని ప్రార్థించడమే ఇస్తిగ్ఫార్.




సాధారణంగా ముస్లింలు ఇలా చదువుతారు:' 'అస్తగ్ఫిరుల్లాహ్"అంటే నేను అల్లాహ్‌ను క్షమాపణ కోరుతున్నాను అని అర్థం.

**నవాఫిల్ .....**

నవాఫిల్ అనగా ఫర్జ్ నమాజులకు అదనంగా, అల్లాహ్ సంతోషం కోసం స్వచ్ఛందంగా చేసే నమాజులు. ఇవి తప్పనిసరి కాకపోయినా, ఆధ్యాత్మిక శాంతి, పుణ్యఫలం ఎక్కువగా లభిస్తాయని ఇస్లామీయ విశ్వాసం. షాబెబరాత్ వంటి పవిత్ర రాత్రుల్లో నవాఫిల్ చదవడం ఎంతో శ్రేష్ఠమని మత పెద్దలు సూచిస్తారు.మజీద్ ఏ అరఫాత్ అధ్యక్షులు మహ్మద్ అజ్మీర్ షబ్ ఏ బరాత్ ఇస్లాం ధర్మంలో అత్యంత గొప్ప విశిష్టత కలిగిన పవిత్ర రాత్రి అని తెలిపారు. ఈ రాత్రి పాపాల నుండి విముక్తి పొందేందుకు అల్లాహ్ ఇచ్చిన అమూల్యమైన అవకాశమని పేర్కొన్నారు. కొత్తగూడ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ముస్లిం సోదరులు మజీద్ ఏ అరఫాత్‌ను దర్శించుకుని భక్తి భావంతో ఇబాదత్‌లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ పవిత్ర రాత్రిని వేడుకలుగా కాకుండా, నమాజులు, నవాఫిల్, ఇస్తిగ్ఫార్, దుఆలతో గడపాలని సూచించారు. నిజమైన పశ్చాత్తాపంతో అల్లాహ్ కరుణను కోరిన వారికి పాప విమోచనం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. షబ్ ఏ బరాత్ ద్వారా ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సద్బుద్ధి, ఐక్యత పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు.